సాక్షి
కామారెడ్డి
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



సదుపాయాలు కల్పించాలి

హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు.

- 9లో ▸



గత అభివృద్ధిని చూసే..

గతంలో తాము చేసిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.9 /22.1

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

తెరపైకి రింగ్ రోడ్డు

- కామారెడ్డిలో 54 కిలోమీటర్ల రోడ్డుకు ప్రతిపాదనలు
- రూ.510 కోట్లతో అంచనాలు
- కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ఎమ్మెల్యే కేవీఆర్
- మంజూరు చేయాలని వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదిత రింగ్‌రోడ్డు మ్యాపును చూపిస్తున్న వెంకటరమణారెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాకేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలకు తెరదించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. పట్టణంలోని ట్రాఫిక్ కష్టాలను వివరించి, డీపీఆర్ చూపించి రింగ్ రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా ఎదిగిన తరువాత మరింతగా విస్తరించింది. దీనికి తోడు పట్టణంలో పలు గ్రామాలను విలీనం చేశారు. అయితే పరిధి పెరిగినా.. పట్టణం విస్తరించినా.. సరైన రోడ్డు, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ అవసరాల కోసం పట్టణానికి రావడం, పట్టణం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు పడే ఇబ్బందులను తీర్చేందుకు స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి 'రింగ్‌రోడ్డు'ను తెరపైకి తీసుకువచ్చారు. పట్టణానికి చుట్టూరా రింగ్ రోడ్డు నిర్మిస్తే ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేయించి మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముందుంచారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే.. కామారెడ్డి పట్టణానికి ఉన్న ఇబ్బందులను వివరించి, రింగ్ రోడ్డుకు నిధులు ఇవ్వాలని డీపీఆర్‌తో పాటు వినతిపత్రం అందించారు. కామారెడ్డి పట్టణానికి మరో వందేళ్ల దాకా ట్రాఫిక్ సమస్యలు లేకుండా రింగ్ రోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యే కేంద్ర మంత్రికి విన్నవించారు. పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల మీదుగా దాదాపు 54 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలని రూపొందించిన డీపీఆర్‌ను అప్పగించారు. పట్టణ మ్యాప్‌ను చూపించి మరీ రోడ్డు నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. రోడ్డు నిర్మాణానికి రూ. 510 కోట్లు అవుతాయని అంచనా వేశారు. ఈ రోడ్డు నిర్మిస్తే పట్టణంపై ఒత్తిడి తగ్గుతుందని, అభివృద్ధి పెరుగుతుందని ఆయన పేర్కొంటున్నారు.

ట్రాఫిక్ కష్టాలు అనేకం..

జిల్లా కేంద్రాన్ని రైల్వే లైన్ రెండుగా విభజిస్తోంది. అయితే పట్టణంలో ఒకే రైల్వే వంతెన ఉంది. వాహనాల రద్దీ పెరిగిన తరువాత వంతెన ఏమాత్రం సరిపోవడం లేదు. రైల్వే వంతెన మీద ఏదైనా చిన్న ప్రమాదం జరిగితే వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. అశోక్‌నగర్‌లో రైల్వే గేటు ఉండగా.. రైళ్ల సంఖ్య పెరిగి ప్రతి పావు గంటకోసారి గేటు వేయాల్సి వస్తోంది. గేటు వేసినపుడల్లా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వంతెన విస్తరించకపోవడం, అశోక్‌నగర్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో ప్రజలు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఎటు వెళ్లాలన్నా సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఎన్‌హెచ్–44 బైపాస్ రోడ్డు ద్వారా కొన్ని ప్రాంతాలకు వెళ్లడానికి మాత్రమే అనుకూలంగా ఉంది. సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం ప్రాంతాలకు వెళ్లాలంటే కచ్చితంగా పట్టణంలోకి రావాల్సిందే.. అలాగే అటువైపు నుంచి ఇటు వెళ్లేవారు కూడా పట్టణం మీదుగానే వెళ్లాలి. పట్టణంలో ప్రధాన రోడ్లు ఇరుకుగా ఉండడం, ట్రాఫిక్ సమస్య మూలంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కేంద్రం కరుణిస్తుందా..

రింగ్ రోడ్డు నిర్మాణం భారీ వ్యయంతో కూడుకున్న పని. 54 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టడానికి మధ్యలో రెండు చోట్ల రైల్వే వంతెనలు, అలాగే వాగులపైన వంతెనాలు నిర్మించాల్సి ఉంటుంది. జాతీయ రహదారిని దాటే క్రమంలోనూ వంతెనలు అవసరం. దీనికి తోడు భూసేకరణ అనేది పెద్ద సవాల్‌గా ఉంటుంది. రోడ్డు నిర్మాణం చేయాలంటే రూ. 510 కోట్లు అవుతాయని అంచనా వేస్తున్నారు. కేంద్రం కరుణించి రింగ్‌రోడ్డు నిర్మించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

సాక్షి ఎఫెక్ట్..



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వర్షాలు, వరదలతో పాల్వంచ మండలం భవానీపేట గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలి పక్షం రోజులవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై ''ట్రాన్స్'ఫార్మర్' కష్టాలు పట్టించుకోరా'' శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి హుటాహుటిన గ్రామానికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కొన్ని బోర్లకు కనెక్షన్ ఇచ్చారు. మరికొన్నింటికి ఒకటి రెండు రోజుల్లో ఇస్తామని అధికారులు తెలిపారని రైతులు పేర్కొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి అభివృద్ధికి కావాల్సిన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. నియోజకవర్గంలో ఇటీవల వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు కావాల్సిన నిధులు ఇవ్వాలని వినతిపత్రం అందించారు.

సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

- ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు
- వెంటనే అదుపులోకి తెచ్చిన సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాకేంద్రానికి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి సాంకేతిక సమస్యలతో ఒక ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు చెలరేగాయి. వెంటనే విద్యుత్ అధికారులు, సిబ్బంది రంగంలోని దిగి మంటలను అదుపులోకి తెచ్చి, సమస్యను పరిష్కరించారు. ఈ ప్రమాదంతో పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తి అయ్యాక విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2021–2022 బ్యాచ్ ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు (ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ), ఎల్‌ఎల్‌బీ 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షల ఫలితాల (సెప్టెంబర్ 2025) రీవాల్యుయేషన్ (పునఃమూల్యాంకనం) కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.500లు చెల్లించాలని, రూ.25లు చెల్లించి దరఖాస్తు ఫారం పొందాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 17వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కంట్రోలర్ సూచించారు.



గ్రామ పాలనాధికారులకు నియామక పత్రాలను అందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

రెవెన్యూకు మంచి పేరు తీసుకురావాలి

కామారెడ్డి క్రైం: ఉత్తమ సేవలు అందించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో 363 గ్రామ పాలనాధికారుల పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ క్లస్టర్లకు కేటాయించిన గ్రామ పాలన అధికారులకు కలెక్టర్ నియామక ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెవెన్యూ శాఖలో పనిచేసి ప్రస్తుతం ఇతర శాఖల్లో ఉన్నవారిని ప్రభుత్వం ఎంతో నమ్మకంతో మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకుందన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా కేటాయించిన క్లస్టర్లలో రెవెన్యూ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూభారతి చట్టం అమలు, ఇతర రెవెన్యూ విధులను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం సందర్శించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పరిశీలించారు. సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, భద్రత సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో వీణ, తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం డీటీ అనిల్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'నగదు రహిత లావాదేవీలు జరపాలి'



దోమకొండలో నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

దోమకొండ: నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించడం కోసం జిల్లాలో దోమకొండ మండలాన్ని ఎంపిక చేసినట్లు డీఆర్‌డీవో సురేందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆయన మండలానికి చెందిన గ్రామ సంఘాల సభ్యులు, ఐకేపీ సీసీలు, సీఏలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ సంఘాల అధ్యక్షులు, సిబ్బంది డిజిటల్ లావాదేవీలు జరిగేలా చూడాలని కోరారు. యూపీఐ ద్వారా రోజూ లక్ష రూపాయల వరకు లావాదేవీలు జరుపవచ్చన్నారు. మహిళలకు డిజిటల్ లావాదేవీలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఐకేపీ ఏపీడీ విజయలక్ష్మి, డీపీఎం శ్రీనివాస్, కెనరా బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చివరికి నిరాశే!

బీబీపేట: అన్నదాతల యూరియా కష్టాలు తీరడం లేదు. బస్తా ఎరువు కోసం రోజూ సొసైటీకి రావడం, గంటల తరబడి క్యూలో వేచి ఉండడం నిత్య కృత్యంగా మారింది. అయినా యూరియా దక్కకపోవడంతో నిరాశ చెందుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రానికి యూరియా లోడ్ రానుందన్న సమాచారంతో రైతులు తెల్లవారుజామునే తరలివచ్చారు. సొసైటీ పరిధిలో 11 గ్రామాలు ఉండగా.. యూరియా కోసం అన్ని గ్రామాల నుంచి రైతులు వచ్చారు. క్యూలో రాళ్లు, చెప్పులు, చెట్ల కొమ్మలు ఉంచి నిరీక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు కూడా లోడ్ రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి యూరియా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.



బీబీపేట సొసైటీ వద్ద క్యూలో ఉంచిన రాళ్లు, చెప్పులు, చెట్ల కొమ్మలు

జీజీహెచ్‌లో వర్చువల్‌గా క్యాన్సర్ సెంటర్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌లోని జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డే కేర్ క్యాన్సర్ సెంటర్‌ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. సెంటర్‌లో క్యాన్సర్ రోగులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు చికిత్స అందుతుందని, ఇప్పటివరకు హైదరాబాద్‌లోని ఎంజే క్యాన్సర్ ఆస్పత్రిలో మొదటి డోస్ చికిత్స పొందిన రోగులు రెండో డోస్ నుంచి డే కేర్ సెంటర్‌లోనే చికిత్స పొందవచ్చిన మంత్రి అన్నారు. హైదరాబాద్ వరకు రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే రోగులు సమయానికి చికిత్స పొందే అవకాశం లభిస్తుందన్నారు. అలాగే అవసరమైన సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్థో హెచ్‌వోడీ డాక్టర్ రాములు, డాక్టర్ కిశోర్, డాక్టర్ చైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొరతకు కారణం పోడేనా?



గాంధారి మండలంలో సాగు భూమిగా మారిన గుట్ట (ఫైల్)

- ఏటా పెరుగుతున్న అటవీ భూముల సాగు విస్తీర్ణం
- తలకిందులవుతున్న వ్యవసాయ అధికారుల అంచనాలు
- యూరియా దొరక్క ఇబ్బందిపడుతున్న రైతులు

కామారెడ్డి క్రైం : జిల్లాలోని పలు ప్రాంతాలలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. రైతులు రోజూ ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితులున్నాయి. అయితే అధికారుల అంచనాల మేరకు జిల్లాకు యూరియా వచ్చినా కొరత ఏర్పడడం గమనార్హం. దీనికి పోడు వ్యవసాయమే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రతి సీజన్ ప్రారంభానికి ముందు వ్యవసాయ శాఖ అధికారులు సాగులోకి వచ్చే పంటలు, గత సీజన్‌ను బట్టి అవసరమైన ఎరువులు, విత్తనాల విషయంలో అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. దాని ప్రకారమే అన్ని జిల్లాలకు విత్తనాలు, ఎరువుల సరఫరా జరుగుతోంది. ఈ లెక్కలన్నీ జిల్లావ్యాప్తంగా అధికారికంగా ఉన్న సాగు భూములు, సాగయ్యే పంటలపై ఆధారపడి ఉంటాయి. కామారెడ్డి జిల్లా విషయానికి వస్తే దాదాపు ప్రతి సీజన్‌లోనూ ఎరువుల కొరత కనిపిస్తుంది. ఈసారి కూడా ఖరీఫ్ చివరలో కామారెడ్డి డివిజన్ పరిధిలో తీవ్రమైన ఎరువుల కొరత నెలకొంది. రైతులు సింగిల్‌విండోల ఎదుట బారులు తీరుతున్నారు. బస్తా యూరియా కోసం రోజుల తరబడి సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు.

లెక్కలోకి రాని సాగు వల్లే..

జిల్లాలో ఒకప్పుడు 84 వేల హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ భూమి విస్తరించి ఉండేది. అటవీశాఖ కామారెడ్డి, బాన్సువాడ సబ్‌డివిజన్‌ల పరిధిలో 8 రేంజ్‌లు ఉన్నాయి. గాంధారి, లింగంపేట, మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల పరిధిలో అడవులు ఎక్కువగా ఉన్నాయి. గతంలో భూమి లేని నిరుపేదలు ఎక్కడో ఓ చోట కొద్దిపాటి భూమిలో పోడు వ్యవసాయం చేసేవారు. కానీ ప్రభుత్వాలు పోడు పట్టాలు ఇవ్వడం మొదలుపెట్టాక చాలామంది అటవీ భూములను కబ్జా చేసి వ్యవసాయం చేస్తున్నారు. దీంతో జిల్లాలో చాలా వరకు అటవీ విస్తీర్ణం తగ్గిపోయింది. ఒకప్పుడు దట్టమైన అటవీ ప్రాంతాన్ని కలిగిన గాంధారి, లింగంపేట, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల పరిధిలో అడవులు, గుట్టలు మాయమయ్యాయి. ఈ భూములలో సాగవుతున్న పంటలు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల్లోకి రాకపోవడంతో అంచనాలు తలకిందులవుతున్నాయి. దీంతో ఎరువులు దొరక్క రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అడవుల ఆక్రమణకు చెక్‌పెట్టాలని, ఎరువుల కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు.

సరఫరా సక్రమంగానే ఉన్నా..

ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 5.23 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనాలు వేశారు. గత ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 49 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు వినియోగించారు. ఈసారి(మే నుంచి సెప్టెంబర్ వరకు) 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 18,222 మెట్రిక్ టన్నుల డీఏపీ, 16,926 మెట్రిక్ టన్నుల ఏంవోపీ, 44,762 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇప్పటికే జిల్లాకు 48 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాగా.. దానిని రైతులకు పంపిణీ చేశారు. ఇంకా సెప్టెంబర్ కోటా రావాల్సి ఉంది.

ఎఫ్‌సీఎస్‌లో నాటకీయ పరిణామాలు

- 24 గంటల్లోనే పదవిని కోల్పోయిన పెద్దసాయిలు
- మళ్లీ జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణకే బాధ్యతలు



జిల్లా అధ్యక్షుడిగా ఉత్తర్వులు అందుకుంటున్న సత్యనారాయణ

కామారెడ్డి అర్బన్: జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం(ఎఫ్‌సీఎస్) అధ్యక్షుడిగా నియమితులైన పెద్ద సాయిలు.. 24 గంటల్లో ఆ పదవిని వీడాల్సి వచ్చింది. గాదం సత్యనారాయణకే మళ్లీ బాధ్యతలు అప్పగించారు.

లింగంపేట మండలంలోని మోతె గ్రామానికి చెందిన గాదం సత్యనారాయణ గతంలో జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. అయితే ఆయన గ్రామంలో నివసించడం లేదన్న కారణంతో అక్కడి సంఘంలో ప్రాథమిక సభ్యత్వం తొలగించారు. దీంతో ఆయన జిల్లా అధ్యక్ష పదవిని కోల్పోయారు. కాగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న పసుపుల పెద్ద సాయిలును సోమవారం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. అయితే తన సభ్యత్వం రద్దు విషయంలో సత్యనారాయణ సహకార ట్రిబ్యునల్ నుంచి స్టే ఆర్డర్ తీసుకువచ్చి సోమవారం సాయంత్రం జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతికి అందించారు. దీంతో మంగళవారం స్టే ఆర్డర్‌ను అమలు చేయడంతో పెద్ద సాయిలు పదవిని కోల్పోవాల్సి వచ్చింది. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మేనేజింగ్ డైరెక్టర్ డోలిసింగ్ మంగళవారం మధ్యాహ్నం సత్యనారాయణను అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ట్రిబ్యునల్ నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గాదం సత్యనారాయణ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతారని డోలిసింగ్ తెలిపారు.

బాన్సువాడకు జ్వరమొచ్చింది!

- వ్యాధులతో బాధపడుతున్న డివిజన్ ప్రజలు
- ఏరియా ఆస్పత్రికి పెరుగుతున్న రోగుల తాకిడి
- రోజూ 800 పైనే ఓపీ..
- ప్రైవేటు ఆస్పత్రులలోనూ రద్దీ



బాన్సువాడ ఆస్పత్రిలో ఓపీ స్లిప్‌ల కోసం బారులు తీరిన ప్రజలు



ఒకే మంచంపై ఇద్దరికి వైద్య సేవలు..

బాన్సువాడ : బాన్సువాడ డివిజన్‌లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు చాలామంది కీళ్ల, ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. మరోవైపు దగ్గు, జలుబు వేధిస్తున్నాయి. దీంతో ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి రోజూ 800 నుంచి 900 వరకు జ్వర పీడితులు వస్తున్నారు. రోగులతో ప్రైవేట్ ఆస్పత్రులూ కిటకిటలాడుతున్నాయి.

నెల రోజులుగా..

ప్రజలు నెల రోజులుగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. డివిజన్‌లోని బాన్సువాడ, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్, బీర్కూర్, నస్రుల్లాబాద్, పెద్దకొడప్‌గల్‌లతోపాటు పొరుగున ఉన్న కంగ్టి, నారాయణఖేడ్ మండలాలనుంచీ రోగులు బాన్సువాడఆస్పత్రికి వస్తున్నారు. జ్వరం, మలేరియా, డెంగీ, వాంతులు, విరేచనాలు, కాళ్ల వాపులు, కీళ్ల, ఒళ్లు నొప్పులు రోజుల తరబడి తగ్గకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. నొప్పుల తీవ్రత అధికంగా ఉండడంతో రోజుల తరబడి మంచానికే పరిమితం కావాల్సి వస్తోంది. ఫలితంగా ఏ పని సొంతంగా చేసుకోలేకపోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరగడంతో ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురికి చికిత్సలు చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులలోనూ రోగుల తాకిడి ఉంది.

కీళ్ల నొప్పులు తగ్గడం లేదు



పదిహేను రోజులుగా జ్వరం వస్తోంది. కీళ్ల నొప్పులు రావడంతో ఆస్పత్రికి వచ్చాను. మూడు రోజులుగా చికిత్స చేస్తున్నారు. నొప్పులు తగ్గడం లేదు. లేవడానికి చేతనైత లేదు. ఇంకొకరి సాయం తీసుకోవాల్సి వస్తోంది. – నారాయణ, గోర్గల్

జ్వరం తగ్గడం లేదు



మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. ఆర్‌ఎంపీ వద్ద చూపించుకున్నా తగ్గలేదు. అందుకే బాన్సువాడ దవాఖానాకు వచ్చిన. జ్వరం మాత్రం తగ్గడం లేదు. ఏమైందో కానీ చాలామంది జ్వరాలతో బాధపడుతున్నారు. – సాయిలు, బొల్లక్‌పల్లి

మందులు అందుబాటులో ఉన్నాయి



వాతావరణంలో మార్పులతో చాలామంది జ్వరం, వాంతులు, విరేచనాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. అందరికీ వైద్యం అందిస్తున్నాం. మందులు అందుబాటులో ఉన్నాయి.

– విజయలక్ష్మి, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, బాన్సువాడ

క్లుప్తంగా

దరఖాస్తు గడువు పెంపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ కేంద్రం ఇన్‌చార్జి, కల్వరాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకే సంవత్సరం పదో తరగతి పాసైన వారికి ఒకే సంవత్సరం ఇంటర్‌మీడియట్ పూర్తవుతుందని.. రెగ్యులర్ ఇంటర్‌తో సమానమైన అవకాశాలుంటాయన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని సర్వాపూర్, ముదెల్లి గ్రామాల్లో మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి వరి పంటలను పరిశీలించినట్లు ఏవో రాజలింగం తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో పంటలకు నష్టం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టం జరిగిన పంటలు, బాధిత రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు ఏవో తెలిపారు. ఏఈవో దీక్షిత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉత్తునూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికుమార్ అన్నారు. మంగళవారం ఆశాడే సందర్భంగా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా వీధులతో పాటు పరిసరాల్లో చెత్తా చెదారం కూరుకుపోయి ఉంటుందన్నారు. ఆశాకార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎస్‌ఎం భాగ్యశ్రీ, హెచ్‌ఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం రోడ్డును బాగు చేయండి




కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఇటీవల వరదలకు ధ్వంసమైన హౌసింగ్ బోర్డుకాలనీ వైకుంఠధామానికి వెళ్లే రోడ్డును తక్షణమే బాగు చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు రోడ్డును పరిశీలించారు. మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. వారం రోజులుగా అంత్యక్రియలకు వచ్చిన పలువురు శ్మశానవాటికకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వివరించారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి రోడ్డు బాగు చేయించాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకట్ గౌడ్, కొత్త నర్సింలు, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

కోట దుర్గమ్మ ఆలయ కార్యవర్గం



బాన్సువాడ: బాన్సువాడ కోట దుర్గమ్మ ఆలయ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పద్మ నరేష్, గౌరవ అధ్యక్షుడిగా చిదుర శివకుమార్, ఉపాధ్యక్షుడిగా బుడాల సాయిలు, ప్రధాన కార్యదర్శిగా దాసరి బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా రాగిరి శ్రావణ్ కుమార్, కోశాధికారిగా పత్తి మహేందర్, సహాయ కోశాధికారిగా నవీన్‌లను ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, గంగాధర్, ఉప్పరి లింగం తదితరులున్నారు.

ఐకేపీ వీవోఏల సంక్షేమ సంఘం కార్యవర్గం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఐకేపీ వీవోఏల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గౌస్ ఖాన్ తెలిపారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విక్రమ్ గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌రావు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షురాలిగా ప్రభావతి రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీ ప్రియ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా కవితను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ

- సిబ్బంది కేటాయింపులో అధికారుల అలసత్వం
- చికిత్స కోసం బీర్కూర్, బాన్సువాడకు వెళ్లాల్సిన పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నిర్మాణం పూర్తయినా సేవలు మొదలు కాని నస్రుల్లాబాద్ పీహెచ్‌సీ

నస్రుల్లాబాద్: మండలాలు ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా చికిత్స కోసం పాత మండలాలు, ఏరియా ఆస్పత్రులకు వెళ్లాల్సి రావడం మాత్రం తప్పడం లేదు. గర్భిణులు, చిన్నారులు ప్రతి నెలా టీకాల కోసం బీర్కూర్ వెళ్లి రావాల్సి వస్తుంది. ప్రతి వారం నస్రుల్లాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల నుంచి మహిళలు ఇబ్బందులు పడుతూ పోతున్నారు. నూతన పంచాయతీ ఏర్పాటై తర్వాత కూడా పాత మండలాలకు వెళ్లి చికిత్స చేసుకుంటున్నారు.

అలంకారప్రాయంగా..

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) రూ.1.43 కోట్లతో పూర్తి చేశారు. దీనికి తోడు రూ.12 లక్షలు పెట్టి సీసీ రోడ్లు సైతం పూర్తి చేశారు. కాని అధికారులు సిబ్బంది కేటాయింపులో అలసత్వం ప్రదర్శిస్తుండటంతో అలంకారప్రాయంగా దర్శనం ఇస్తోంది. వివిధ మండలాల నుంచి ఫర్నిచర్‌ను తీసుకువచ్చి పెట్టారు. మంత్రులతో ప్రారంభింపజేయాలని స్థానిక నాయకులు ఎదురు చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య సఖ్యత లేకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు.

అందుబాటులో లేని వాక్సిన్‌లు

నస్రుల్లాబాద్‌లో కుక్కలు, కోతుల బెడద విపరీతంగా ఉంది. అటవీ ప్రాంతానికి దగ్గరగా మండలం ఉండటంతో పాములు, కుక్కలు, కోతుల కాట్లకు గురవుతున్నారు. అయితే స్థానికంగా వాక్సిన్ నిల్వ చేసే ఏర్పాట్లు లేకపోవడంతో బీర్కూర్, బాన్సువాడ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

అందుబాటులోకి తీసుకురావాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు. అధికారులు నాయకులు త్వరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చి ప్రజల అవసరాలు తీర్చాలి.

– నర్సింలు గౌడ్, నస్రుల్లాబాద్

సమయానికి అందడం లేదు



మండలంలో సరైన వైద్య సదుపాయం లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. పాము కాటు వాక్సిన్ సమయానికి అందక ప్రాణాలు పోతున్నాయి. పీహెచ్‌సీని ఉపయోగంలోకి తీసుకొస్తే ప్రజలకు మేలవుతుంది.

– అల్లం రాములు, మైలారం

కొలువుదీరిన తిరుపతి బాలాజీ జెండా

- 11 రోజుల పాటు పూజలు
- పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు



మద్నూర్‌లో కొలువుదీరిన బాలాజీ జెండా

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో మంగళవారం రాత్రి తిరుమల తిరుపతి శ్రీ బాలాజీ జెండా కొలువుదీరింది. పాత బస్టాండ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయం ముందు గ్రామస్తులు, జెండా కమిటీ సభ్యులు బాలాజీ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. భక్తులు గోవిందా.. గోవిందా... వెంకట రమణ గోవిందా అంటూ బాలాజీ జెండాకు స్వాగతం పలికారు. ప్రతి సంవత్సరం గణేష్ నిమజ్జన అనంతరం తిరుమల జెండా వస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. జెండా మద్నూర్‌లో 11 రోజుల పాటు పూజలు అందుకుంటుందని.. అనంతరం ఈ జెండా తిరుపతి శ్రీవారి ఆలయానికి బయలుదేరుతుందని వారు పేర్కొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన బేడ బుడగ జంగం కులస్తులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లాలో గోసంగి కులం వారు లేరని బేడ బుడగ జంగాలు మాత్రమే ఉన్నారని, బేడ బుడగ జంగాల పేరు మీద కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరుపాటి వేణు అన్నారు. ఈమేరకు కామారెడ్డి కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుశురాం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గిర్ని వెంకటి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పత్తి భాష, రాష్ట్ర జేఏసీ చైర్మన్ తూర్పాటి హనుమంతు, జేఏసీ వైస్ చైర్మన్ తూర్పాటి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం యూరియా కష్టాలను తీర్చాలి

- ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్

రామారెడ్డి/కామారెడ్డిరూరల్: యూరియా కోసం రాత్రి పగలు తేడా లేకుండా రైతులు జాగారం చేస్తున్నారని, యూరియా కష్టాలను తీర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ సర్కార్‌దేనని ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం స్కూల్ తండాలో రిటైర్డ్ ఎస్సై గంగావత్ పెంటయ్య, రామారెడ్డిలో పడిగెల శ్రీనివాస్, అలాగే కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో పార్టీ నేత కొప్పుల సుదర్శన్‌లను పరామర్శించారు. తిరుగు ప్రయాణంలో రైతులు యూరియా కష్టాలను గంప గోవర్ధన్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ముందు చూపు లేకపోవడం వల్లే రైతులు యూరియా కష్టాలను ఎదుర్కోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూరియా కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు.

ఊపిరితిత్తుల్లో ఇరుకున్న శనగ గింజ

- చికిత్స చేసి తొలగించిన వైద్యులు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన 27 ఏళ్ల వ్యక్తి ఊపిరితిత్తుల్లో ఇరుకున్న శనగ గింజను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేసి తొలగించి ఆయన ప్రాణాలు కాపాడారు. వివరాలు.. వారం రోజులుగా దగ్గు, దమ్ము, ఛాతినొప్పితో తీవ్ర అవస్థ పడుతున్న ఓ వ్యక్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పతికి చికిత్స కోసం మంగళవారం వచ్చాడు. వైద్యులు పరీక్షించి, స్కానింగ్ చేయగా ఆయన ఊపిరితిత్తిలో ఒక శనగ గింజ ఉందని గుర్తించారు. పల్మనాలజిస్టు వైద్యుడు సాయికృష్ణారావు తన వైద్య బృందంతో కలిసి అధునాతనమైన బ్రాంకోస్కోపి చికిత్స ద్వారా ఇరుకున్న శనగగింజను తొలగించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉందని, తినేటప్పుడు శనగ గింజ పొరపాటున ఊపిరితిత్తులలో ఇరుక్కుని ఉంటుందని వైద్యులు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పగిలిన లింబు

- గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం



పగిలిన లింబు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం లింబు పగిలిపోవడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సబ్‌స్టేషన్‌లో 8 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బయటకు వచ్చే ఎల్‌వీ బ్రేకర్‌పై లింబు ఆకస్మికంగా పగిలిపోయింది. కాగా లింబు పగిలిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. కాగా నూతన లింబును తీసుకువచ్చి బిగించేవరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో మండల కేంద్రం గోపాల్‌పేటతోపాటు పలుగ్రామాలకు 5 గంటలకుపైగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

ఆపదలో ఆదుకున్న వారే గొప్పవారు

- ఆర్డీవో పార్థసింహారెడ్డి

ఎల్లారెడ్డి: ఆపదలో ఆదుకున్న వారే గొప్పవారని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లారెడ్డిలో చాలా మంది ఇళ్లు కూలాయని, చెరువు కట్టలు తెగిపోవడంతో పంటలు నీట మునిగిపోవడం, ఇసుక మేటలు వేయడం, పంటలు కొట్టుకుపోయాయన్నారు. ఇలాంటి వారికి ఆపత్కాలంలో లయన్స్ క్లబ్ వారు నిత్యావసర వస్తువులు అందించడం చాలా సంతోషదాయకమన్నారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ అమర్నాథ్‌రావు, బసవేశ్వర్‌రావు, సంజీవరెడ్డి, రమేష్, నర్సింహరాజు, నాగరాజు, పద్మావతి, డీటీ శ్రీనివాస్, గిర్దావర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ తదితరులున్నారు.



లయన్స్ క్లబ్ తరపున నిత్యావసర వస్తువులను అందిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

భిక్కనూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మెడిసిటి ఘన్‌పూర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు అన్ని రకాల రోగాల పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరం కొనసాగింది. 756 మంది వైద్య పరీక్షలను చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని గాజులపేట్‌లోగల ఏఆర్ జిరాక్స్ వద్ద బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని గాజులపేట్‌కు చెందిన ప్రేమ్‌కుమార్(45) మంగళవారం బైక్‌పై కంఠేశ్వర్‌కు బయలుదేరాడు. గాజులపేట్‌లోని ఏఆర్ జిరాక్స్ వద్ద ఓ కారు యూటర్న్ తీసుకుంటుండగా, బైక్‌పై వెళుతున్న ప్రేమ్‌కుమార్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో ఇద్దరికి..

జక్రాన్‌పల్లి: మండల పరిధిలో బైక్‌ను కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. ఆర్గుల్ గ్రామానికి చెందిన జైడి నర్సయ్య, అతని కోడలుతో కలిసి బైక్‌పై మంగళవారం ఆర్మూర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో ఆర్మూర్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు జక్రాన్‌పల్లి ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆర్మూర్‌టౌన్: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా.. పెర్కిట్ గ్రామానికి చెందిన సిరిగాల లక్ష్మీ ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెందింది. దీంతో సోమవారం రాత్రి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కానీ స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మహిళను చెరువులో దూకకుండా అడ్డుకొని కాపాడి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిండు ప్రాణాలు కాపాడిన ఆర్మూర్ ఎస్బీ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, ఏఎస్సై రాందాస్‌ను స్థానికులు అభినందించారు.

హైవేపై అదుపుతప్పిన టిప్పర్

డిచ్‌పల్లి: మండలంలోని బీబీపూర్ తండా సమీపంలోగల 44వ నంబరు జాతీయ రహదారిపై కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కంకర లోడ్‌తో టిప్పర్ మంగళవారం ఇందల్వాయి నుంచి నిజామాబాద్ బయలుదేరింది. బీబీపూర్ తండా సమీపంలో టిప్పర్ అతివేగంతో అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా, టిప్పర్ ముందుభాగం దెబ్బతింది. స్థానికులు బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఆంధ్రనగర్ గ్రామంలో డివైడర్ ఢీకొని కారు బోల్తా పడగా, అందులోని ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. నిజామాబాద్ నుంచి నందిపేట్ వైపు వస్తున్న కారు మంగళవారం ఆంధ్రనగర్ గ్రామంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పల్టీలు కొడుతూ కొద్ది దూరం వెళ్లి బోల్తా పడింది. వెంటనే స్థానికులు కారు వద్దకు వెళ్లి అందులోని ముగ్గురు ప్రయాణికులను బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు డొంకేశ్వర్ గ్రామానికి చెందిన వారీగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మొక్కలు మేసిన మేక.. యజమానికి జరిమానా

ఎల్లారెడ్డి: వనమహోత్సవంలో నాటిన మొక్కలను మేకలు మేయడంతో సదరు మేకల యజమానికి జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. మున్సిపాలిటీకి సంబంధించిన డివైడర్లపై నాటిన మొక్కలను ఇటీవల మేకలు మేసినట్లు పేర్కొన్నారు. దీంతో మొదటితప్పుగా భావించి మేకల యజమానికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు. ఇకపై మేకలు మొక్కలను మేస్తే వాటిని జప్తు చేస్తామన్నారు. రోడ్లపై పశువులు, మేకలను ఇష్టారాజ్యంగా వదలడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ఇకనుంచి ఇలా వదలవద్దని యజమానులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నరసింహారెడ్డి (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇందల్వాయి: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా.. అదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడకు చెందిన నరసింహారెడ్డి(21), విశాల్ అనే ఇద్దరు యువకులు హైదరా బాద్‌లో బీటెక్ చదువుతున్నారు. వారు మంగళవారం వేకువజామున కారులో హైదరాబాద్ నుంచి ఇచ్చోడకు బయలుదేరారు. ఇందల్వాయి మండలంలోని దేవితండా హైవే వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కారు నడుపుతున్న విశాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా కారు నడిపిన విశాల్‌పై, లారీ పార్క్ చేసిన హర్యానాకు చెందిన లారీ డ్రైవర్ ఆలాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..

సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామ చెరువులో ఓ వృద్ధుడు పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గోప్య తండాకు చెందిన బుక్యా శంకర్(59) అనే వృద్ధుడు సోమవారం చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లాడు. రాత్రి అయిన అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా శంకర్ కనిపించలేదు. చెరువు కట్టపై అతడి బట్టలు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో వెతకగా చెరువులో శంకర్ మృతదేహం లభ్యమైంది. మృతుడి కొడుకు సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 14మంది పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. వారికి మంగళవారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం జిల్లా కోర్టులో హాజరుపర్చారు. జడ్జి వారిలో 10 మందికి రూ.12వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురికి రెండు రోజులు, ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

బిచ్కుంద(జుక్కల్): మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. పోలీసులు మంగళవారం అతడిని బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. కోర్టుకు హాజరైన సదరు వ్యక్తి మద్యం తాగి వచ్చాడు. దీంతో జడ్జి అతడికి వారం రోజుల పాటు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు కోర్టు సూపరింటెండెంట్ అసదుల్లా తెలిపారు.

దోమకొండ: మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. సదరు వ్యక్తిని పోలీసులు మంగళవారం కామారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి అతడికి ఒకరోజు జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఒకరికి..

నిజామాబాద్ లీగల్: బ్యాంకు చెక్కు బౌన్స్ అయిన కేసులో ఓ వ్యక్తికి నిజామాబాద్ మొదటి అదనపు కోర్టు మేజిస్ట్రేట్ కుష్బు ఉపాధ్యాయ ఏడాది జైలు శిక్ష విధించారు. వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని అంబర్‌పేట్‌కు చెందిన ఆకుల నాగభూషణంకు తన స్నేహితుడు షేక్ అమస్ ద్వార గౌతంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి సయ్యద్ సాధిక్ షరీఫ్ పరిచయమయ్యాడు. ఈక్రమంలో షరీఫ్‌కు అవసరం నిమిత్తం 2020లో రూ.8,50,000వేలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు తీసుకునే సమయంలో గ్యారెంటీగా చెక్కు ఇచ్చాడు. తాను ఇవ్వాల్సిన డబ్బులకు షరీఫ్ 2021లో ఓ చెక్కును నాగభూషణంకు ఇచ్చాడు. అతడు చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో నాగభూషణం కోర్టులో కేసు వేయగా న్యాయమూర్తి విచారణ చేపట్టారు. అనంతరం నాగభూషణంకు ఇవ్వాల్సిన డబ్బులను నిందితుడు 9 అక్టోబర్, 2025 నుంచి ప్రతినెల రూ.1,06,250 చొప్పున చెల్లించాలని, అలా చెల్లించని పక్షంలో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని జండాగల్లీలోగల ఓ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడిచేసి, పేకాడుతున్న వారిని పట్టుకున్నామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 9,910 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

ఎల్లారెడ్డి: ఇటీవల భారీ వర్షాలకు ఇళ్లు కూలిన బాధితులు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా పాక్షికంగా కాని, పూర్తిగా కాని ఇళ్లు కూలినట్లయితే ఇంటి నిర్మాణం చేసుకోదల్చిన వారు ఇందిరమ్మ ఇళ్ల కోసం వార్డు ఆఫీసర్ల వద్ద దరఖాస్తులను బుధవారం లోగా అందించాలని అన్నారు.

పాత రాజంపేటలో నిలిచిన అంత్యక్రియలు

- సల్మాబేగంను 20 యేళ్ల క్రితం వదిలి వెళ్లిన కుమారుడు
- మంగళవారం మృతిచెందిన సల్మాబేగం.. అంత్యక్రియలు చేయడానికి వచ్చిన కుమారుడు
- ఒప్పుకోని స్థానికులు
- దత్తత కుమార్తె కరిష్మా బేగం చేయాలని నిర్ణయించిన గ్రామస్తులు



సల్మాబేగం (ఫైల్)



తానే కుమారుడినని వచ్చిన వ్యక్తి



రోదిస్తున్న దత్తత కుమార్తె కరిష్మాబేగం

కామారెడ్డి రూరల్: తల్లిని కంటికి రెప్పలా కాపాడుకొని ఆసరాగా ఉండాల్సిన కుమారుడు 20 ఏళ్ల క్రితం ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. కుమారుడు వెళ్లిపోయాడని ఆ తల్లి కుంగిపోలేదు. కామారెడ్డిలో దొరికిన ఒక అమ్మాయిని పెంచుకుని పెళ్లి చేసి పంపించింది. మంగళవారం ఆ తల్లి మృతి చెందగా చెందగా 'తానే కొడుకునని అంత్యక్రియలు నేనే చేస్తాను. మా ఊరికి తీసుకెళ్తాను' అని వచ్చిన కొడుకును నువ్వెవరో తెలియదు అని వెళ్లగొట్టారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పాత రాజంపేటలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సల్మాబేగంను 20 సంవత్సరాల క్రితం కుమారుడు వదిలి వెళ్లిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు తనను వదిలి వెళ్లిపోవడంతో కొద్దిరోజులు బాధపడింది. తన రాత ఇంతే అనుకుని జీవిస్తుండగా కొద్దిరోజులకు కామారెడ్డి పట్టణంలో దొరికిన కరిష్మా బేగం అనే చిన్నారిని పెంచుకుంది. పెద్దయ్యాక సల్మాబేగం.. కరిష్మాకు పెళ్లి చేసి బాధ్యత తీర్చుకుంది. పెళ్లయినా పెంచిన తల్లి మంచి చెడులన్నీ కరిష్మానే చూసుకుంది. గ్రామంలో కూడా మంచి పేరు తెచ్చుకుంది. అయితే మంగళవారం సల్మాబేగం మృతి చెందింది. 20 ఏళ్లుగా అటువైపు రాని కొడుకు తల్లి చనిపోయిన విషయం తెలుసుకొని, అంత్యక్రియలు చేస్తానని తల్లి శవాన్ని తీసుకొని వెళ్లేందుకు గ్రామానికి వచ్చాడు. దాంతో కొడుకుతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. 20 ఏళ్ల తర్వాత తల్లి ఇప్పుడు గుర్తుకొచ్చిందా అంటూ నిలదీశారు. అయితే ఇన్నేళ్ల పాటు సల్మాబేగం మంచి చెడులు చూసిన కరిష్మాయే అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. ఇన్నాళ్లుగా లేని ప్రేమ తల్లి చనిపోయాక రావడంతో ఆస్తి కోసమే వచ్చి ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ విషయం పోలీసుల దాకా వెళ్లడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డితండాకు చెందిన కెతావత్ రాజు(36)అనే వ్యక్తి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు స్థానిక ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. ప్రతి రోజూ మద్యం సేవించి ఇంటి కొస్తున్న రాజును ఈ నెల 6న ఆయన భార్య లలిత, కుటుంబసభ్యులు మందు తాగితే ఆరోగ్యం పాడవుతుందని మందలించడంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కుటుంబసభ్యులు తీసుకురాగా 7 తేదీన రాత్రి గడ్డిమందు తాగాడు. వెంటనే భార్య లలిత, కుటుంబసభ్యుల సహాయంతో రాజును చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి, అక్కడి నుంచి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువుకట్టలకు మరమ్మతులు చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: చెరువు కట్టలు తెగిపోయిన వాటికి సత్వరమే మరమ్మతులు చేయించాలని బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, సతీష్‌లు కోరారు. వారు ఎల్లారెడ్డిలో మాట్లాడుతూ.. వరదల కారణంగా చెరువు కట్టలు తెగి పోవడంతో వాటిలో నీరు లేకుండా పోయిందని, తెగిన కట్టలకు మరమ్మతులు చేస్తే వాటిలో పోచారం నుంచి నీరు నింపుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. దీని వల్ల రైతుల పంటలు ఎండకుండా ఉంటాయన్నారు. అధికారులు తక్షణం స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు.